## క్లుప్తంగా

### ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న వాణీనాగేశ్ దంపతులు

ఘట్‌కేసర్: చౌదరిగూడ మక్త గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ మహంకాళీ అమ్మవారి ఆలయం, శివాలయం పునర్ నిర్మాణానికి ఆ గ్రామ వార్డు సభ్యురాలు బండ్లగూడ వాణినాగేశ్ దంపతులు విరాళమిచ్చారు. వార్డు సభ్యురాలి నివాసంలో శనివారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు రూ. 51,116లు విరాళం అందజేశారు. కార్యక్రమంలో పాండుగౌడ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### కల్యాణ మండపం ప్రారంభం

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనారాయణ కాలనీలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన కల్యాణ మండపాన్ని శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రారంభినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు లుకాస్, వాసిరెడ్డి శ్రీధర్ ప్రసాద్, నాగేశ్వర్‌రావు, అశోక్‌గౌడ్, వెంకటరెడ్డి, ప్రదీప్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరానికి స్పందన

రామంతాపూర్: దేవేందర్‌నగర్ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో చర్చి వద్ద శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో వివిధ విభాగాల వైద్యులు సుమారు 200 మందిని పరీక్షించి వైద్య సలహాలు, నేత్ర పరీక్షలతో పాటు ఉచితంగా మందులు, కళ్ల జోళ్లు అందజేశారు. కార్యక్రమంలో సిప్కో ఫార్మాషూటికల్, ఆనంద్ ఐ ఇనిస్టిట్యూట్, బ్రిటిష్ బయోలాజికల్ కంపెనీతో పాటు చర్చి ప్రతినిధులు పాల్గొన్నారు.

### ప్రజలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్: దుగ్యాల

మల్లాపూర్: ఎన్నికల ముందు అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. నాచారం డివిజన్ హనుమాన్ నగర్‌లో శక్తి కేంద్ర ఇన్‌చార్జి హనుమంత్ బిరదర్ ఆధ్వర్యంలో ప్రజాగోస-బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్థానిక సమస్యలపై బీజేపీ కార్యకర్తలు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి రవినాయక్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్‌రెడ్డి, అధికార ప్రతినిధి గోపాల్‌గౌడ్, పద్మారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ప్రకాష్, అనితారెడ్డి, రవీందర్‌రావు, సంజీవ రెడ్డి, ఓంకార్, హనుమంత్, శ్రీధర్‌రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

### 20న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఉప్పల్: హబ్సిగూడ డివిజన్ పరిధిలో అధికారులు చొరవ తీసుకుని విద్యుత్ వినియోగదారుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తారని డీఈ సాయిప్రసాద్ తెలిపారు. ఎస్‌ఈ కార్యాలయం ఆవరణలో 20 తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు. బిల్లుల్లో హెచ్చుతగ్గులు, లో ఓల్టేజ్ సమస్యలతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించుకోవచ్చని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

### నేడు ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా బైక్ ర్యాలీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి జిల్లా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని భారీ బైక్ ర్యాలీ, పాదయాత్ర నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటలకు మియాపూర్ మార్కెట్ శివాలయం నుంచి లింగంపల్లి తుల్జాభవానీ దేవాలయం వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందన్నారు. అనంతరం లింగంపల్లిలోని తుల్జాభవానీ దేవాలయం వద్ద భోజన ఏర్పాట్లు చేసినట్లు విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు తెలిపారు.

### ఆరెంజ్ జ్యూస్ పంపిణీ

ఆల్విన్‌కాలనీ: మహాశివరాత్రి సందర్భంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ మహంకాళి చౌరస్తాలో బార్న్ ఫర్ పూర్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు మంజునాథ్, నరేందర్ యాదవ్, రఘు వారి మిత్రులు ఆధ్వర్యంలో శనివారం ఆరెంజ్ జ్యూస్ పంపిణీ చేశారు. ర్యక్రమంలో బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్ పాల్గొని పాదాచారులకు, వాహనదారులకు ఆరెంజ్ జ్యూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి పర్వదినాన ప్రజలకు సేవ చేసే అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో టీవీబీ రెడ్డి, శ్రీకాంత్, రాకేష్, వెంకట్, ఫిరోజ్, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# హర హర మహాదేవ



స్వామిసేవలో మంత్రి చామకూరమల్లారెడ్డి, తదితరులు



కీసరగుట్ట స్వామిసేవలో ఉప్పల్‌ఎమ్మెల్యేబేతీసుభాష్‌రెడ్డి

కీసర: ప్రముఖ శైవక్షేత్రమైన కీసరగుట్ట శనివారం శివనాస్మరణతో మార్మోగింది. మహాశివరాత్రి పర్వదినం రోజున శివుడిని దర్శించుకుంటే మంచిజరుగుతుందన్న నమ్మకంతో శ్రీరామలింగేశ్వరుడిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుండే భక్తులు క్యూలైన్లలో నిల్చున్నారు. ఉదయం 11 గంటల సమయంలో ధర్మదర్శన క్యూలైనులోభక్తులు హుడాపార్కు వరకు వేచి యున్నారు. సాయంత్రం వరకు వేలాదిమంది స్వామివారిని దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం భక్తులు ఉపవాస దీక్ష విరమించారు. అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్యన్, డీసీపీ జానకి, ఏసీపీ వెంకట్‌రెడ్డి, కీసర సీఐ రఘువీర్ రెడ్డి తదితర పోలీస్ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు క్యూలైన్లలో పరిస్థితిని పర్యవేక్షించారు.

### స్వామిసేవలో పాల్గొన్న ప్రముఖులు

మంత్రులు చామకూర మల్లారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బేతిసుభాష్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్, ఎమ్మెల్సీ సురభివాణిరెడ్డి, జెడ్పీవైస్ చైర్మెన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, పలువురు న్యాయమూర్తులు, సీఎంపేషి అధికారులు, వివిధ శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు.

### నేటి పూజాకార్యక్రమాలు

బ్రహోత్సవాల్లో బాగంగా నాల్గోరోజైన ఆదివారం ఆలయంలో ఉదయం 5.30 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకము. ఉదయం 6 నుండి సాయంత్రం వరకు కళ్యాణమండపంలో సామూహిక అభిషేకములు, ఉదయం 9 గం. రుద్రస్వాహకార హోమము, రాత్రి 7 గం, ప్రదోషకాల పూజహారతి మంత్రపుష్పము, రాత్రి 7 గం. శ్రీస్వామివారివిమాన రథోత్సవము ఉంటుంది.





కీసరగుట్టలో క్యూలైన్లలో భక్తుల రద్దీ



శివయ్య వద్ద బసవయ్య (శివలింగంవద్ద గంగిరెద్దు)





కీసరగుట్టలో శివరాత్రి సందర్భంగా శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు

## బారులు తీరిన భక్తులు

మహాశివరాత్రి సందర్భంగా శివాలయాల్లో స్వామివారి దర్శనం కోసం శనివారం తెల్లవారుజామునుంచే భక్తులు బారులు తీరారు. ఆలయాల వద్ద భక్తులు ఇబ్బంది పడకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



ఘట్‌కేసర్ స్వయంభూ నాగలింగేశ్వర స్వామి ఆలయంలో..

మేడ్చల్/మేడ్చల్ రూరల్: మేడ్చల్ పట్టణంలోని రామలింగేశ్వర ఆలయం, వీరభద్ర ఆలయం, చంద్రమౌళీశ్వర ఆలయం, రాజరాజేశ్వరి ఆలయం, కెఎల్‌ఆర్ శివాలయం, గౌడవెళ్లి గుడిబండ ఆలయం, ఎల్లంపేట్ శివాలయం, గుండ్లపోచంపల్లి శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు.

పోచారం: పోచారంలోని సర్వమంగళా సమేత స్పటిక లింగేశ్వరాలయానకి భక్తులు పోటెత్తారు. బారులు తీరిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. విద్యుత్ దీపాలంకరణతో ఆలయ ప్రాంగణం ముస్తాబయ్యింది.



పూడూర్ శివాలయంలో భక్తుల క్యూ



గుండ్లపోచంపల్లిలో

### భాగ్యరెడ్డి వర్మకు నివాళి

అల్వాల్: అల్వాల్‌లోని జేఏసీ ప్రాంగణంలో జేఏసీ నాయకులు భాగ్యరెడ్డి వర్మ 84వ వర్ధంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. తెలంగాణలో ఎన్నో స్కూల్స్ ప్రారంభించారని, బలహీన వర్గాల ప్రజలందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీరాములు, సీఎల్ యాదగిరి, చంద్రశేఖర్, నిమ్మ అశోక్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

నిజాంపేట్: ఏసీలో షార్ట్ సర్క్యూట్ తలెత్తడంతో అపార్ట్‌మెంట్‌లో మంటలు వ్యాపించిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజాంపేట బృందావన్ కాలనీలోని టీవీఎస్ రెసిడెన్సీ ఫ్లాట్ నెంబర్ 201లో శనివారం మధ్యాహ్నం ఏసీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఇంటి యజమాని సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో బెడ్, ఇతర సామాగ్రి కాలిపోయాయని, ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లలేదని బాచుపల్లి పోలీసులు తెలిపారు. ఫ్లాట్ యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# నాలుగేళ్లుగా... నాన్చుడే

- బీసీ కార్పొరేషన్ సాయం కోసం నిరుద్యోగ యువత ఎదురు చూపులు
- 32,405 దరఖాస్తుదారుల్లో ఆందోళన

సాక్షి,మేడ్చల్ జిల్లా: బీసీ కార్పొరేషన్ సాయం కోసం వెనుకబడిన తరగతులకు చెందిన దరఖాస్తు దారులు నాలుగేళ్లుగా నిరీక్షిస్తున్నారు. సబ్సిడీ రుణం వస్తుందనే ఆశతో అప్పులు చేసి వడ్డీల భారం మోస్తున్నారు. 2018 సంవత్సరంలో ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే బీసీ వర్గాలకు రుణాలు మంజూరు చేస్తామని పేర్కొన్న ప్రభుత్వం తర్వాత ముఖం చాటేసింది. రెండోసారి అధికారంలోకి వచ్చాక ఒక్కసారైనా వీటిని పంపిణీ చేయలేదు. గ్రేటర్‌సహా శివారు మేడ్చల్-మల్కాజిగిరి,రంగారెడ్డి జిల్లాలలో 2018 సంవత్సరంలో వెనుకబడిన తరగతులకు చెందిన 32,405 మంది నిరుద్యోగ యువతీ యువకులు ఉపాధి అవకాశాల్లో భాగంగా కుటీర, సూక్ష్మ, చిన్న,మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు సబ్సిడీ రుణాలు మంజూరుకు బీసీ కార్పొరేషన్లకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 11,102 మంది దరఖాస్తు దారులు ఉండగా, రంగారెడ్డి జిల్లాలో 14,346, హైదరాబాద్ జిల్లాలో 7,057 మంది దరఖాస్తుదారులు ఉన్నారు. ఈ దరఖాస్తుదారుల్లో కేవలం 3,273 మందికి మాత్రమే రూ.50 వేల చొప్పున రుణాలు అందజేశారు. ఆ తర్వాత నిధుల విడుదల విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో లబ్ధిదారులు ఆయా జిల్లాలోని సంబంధిత బీసీ కార్పొరేషన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

### నాడు పంపిణీ చేసినవే..

- 2018 ఏప్రిల్ వరకు కొందరికి దాదాపు రూ.16.50 కోట్ల రుణాలు అందజేసినట్లు తెలుస్తోంది. అప్పటికే ఎన్నికల కోడ్ రావడంతో రుణాల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. మిగతా వారికి ఎన్నికల తర్వాత ఇస్తామని ప్రకటించారు. మళ్లీ ఎన్నికల సమయం ఆసన్నమవుతున్నా... ఊసే లేకపోవటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### త్వరలో ఆదేశాలు రావొచ్చు

బీసీ కార్పొరేషన్ రుణాల విషయంలో ఇప్పటివరకు మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. 2018లో పరిస్థితి ఎలా ఉందో..ప్రస్తుతం అలానే ఉంది. త్వరలోనే ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావొచ్చని భావిస్తున్నాం.

– ఝాన్సీరాణి, జిల్లా బీసీ అభివృద్ధి, సంక్షేమ శాఖ అధికారి, మేడ్చల్ జిల్లా

# బ్రహ్మోత్సవ వైభవం





కీసర రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం

- కీసర గుట్ట బ్రహ్మోత్సవాల్లో మూడోరోజు విశేషాలు
- కీసరగుట్టకు వచ్చిన యాత్రికులకు , క్యూలైన్లలో నిల్చున్న భక్తులకు నగరంలోని సోలిస్ ఐ ఆసుప్రతి నిర్వాహకులు పాలతోపాటు, మంచి నీటి ప్యాకెట్లను అందజేసారు.
- ఈ ఏడాది వీఐపీ దర్శన టికెట్లు పరిమిత సంఖ్యలో పంపిణీ చేయడంతో కొద్దిమేర వీఐపీ క్యూలైన్ రద్దీ తక్కువగా కనిపించింది. అయితే ఈక్యూలైన్‌లోనే ఆన్‌లైన్‌లో దర్శనం బుక్‌చేసుకున్న భక్తులను పంపడంతో ఆన్‌లైన్‌లో టిక్కెటు బుక్‌చేసుకున్న యాత్రికులు ఇబ్బందులు పడ్డారు.
- పార్కింగ్ నుండి దేవాలయం వరకు ఈసారి 8 మినిబస్సులను ఏర్పాటు చేసినప్పటికి యాత్రికులకు ఇక్కట్లు తప్పలేదు.
- ధర్మదర్శనంలో స్వామి వారి దర్శనానికి 3 గంటల సమయంపట్టింది.
- కీసరగుట్ట యాత్రికులకు కీసర రెడ్డి సంక్షేమసంఘం, స్థానిక మార్వాడి సంఘం,ఆర్యవైశ్యసంఘం, వంశరాజ్ సంక్షేమసంఘం, శ్రీరామలింగేశ్వర మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

# ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తాం



శ్రీరంగవరంలో మహిళలతో మాట్లాడుతున్న హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్: నియోజకవర్గంలోని ప్రతీ గడపకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించి బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ గతంలో ప్రజలకు ఏం చేసింది తిరిగి అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో వివరిస్తామని పీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. పీసీసీ చేపట్టిన హత్ సే హత్ జోడో యాత్ర స్ఫూర్తిగా మేడ్చల్ మండలం శ్రీరంగవరం గ్రామంలో యాత్ర నిర్వహించి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు ఇచ్చారు. పార్టీ జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో మేడ్చల్ నియోజకవర్గం పూర్తిగా వెనుకపడిపోయిందని,పేద పిల్లలు చదువుకోవడానికి కనీసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకుండా పోయిందని అన్నారు.పట్టణాలలో ఎన్నో సమస్యలు తాండవం చేస్తున్నాయని ప్రతీ సమస్యపై నిరంతరం పోరాటం చేస్తునే ప్రజలకు ప్రభుత్వ వైఫల్యలను వివరిస్తామని అన్నారు. ఎమ్మెల్యేగా మంత్రి మల్లారెడ్డి ఏనాడు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. అసెంబ్లీలో నియోజకవర్గ ప్రజల సమస్యలను లేవనెత్తి పరిష్కారాలు సాధించకుండా అసెంబ్లీ సమావేశాలలో కామెడీలు చేస్తూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల భజనలు చేస్తున్నారని విమర్శించారు.. కార్యక్రమంలో నాయకులు జీనత్‌రెడ్డి, పోచయ్య, బాల్‌రెడ్డి, మల్లారెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# కోడ్ నేపథ్యంలో ఫ్లెక్సీల తొలగింపు



గౌడవెళ్లిలో ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బంది

మేడ్చల్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అధికారులు తొలగించారు. మండలంలోని గుండ్ల పోచంపల్లి-నూతన్‌కల్ రోడ్డులో గౌడవెళ్లి పరిధిలో కాంగ్రెస్ కు చెందిన సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ శివరాత్రి సందర్భంగా గుడిబండ ఆలయానికి వస్తున్న భక్తులకు స్వాగతం తెలుపుతూ భారీ గా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గ్రామస్థుల ఫిర్యాదుతో రెవెన్యూ, పోలీసులు, గ్రామ పంచాయతీ అధికారులు బృందంగా వెళ్లి శనివారం ఫ్లెక్సీలను తొలగించారు.ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందునే ఫ్లెక్సీలను తొలగించామని అధికారులు తెలిపారు.



### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పోలీస్ స్టేసన్ పరిధిలో ఓఆర్‌ఆర్ మూసీ వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మరణించాడు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన మేరకు.. రాజస్థాన్‌కు చెందిన ధూళీ చంద్ (47) ఉపాధి కోసం మరి కొందరితో కలిసి ఓఆర్‌ఆర్ రోడ్డు మరమ్మతు పనులు చేయడానికి వచ్చారు. శనివారం సాయంత్రం దూళీచంద్ పనులు పూర్తి కాగానే ఓఆర్‌ఆర్ మూసీ వంతెన వద్ద రేలింగ్ పక్కన నిలబడ్డాడు. అదే సమయంలో స్విఫ్ట్ కారులో డ్రైవర్ చల్లమల్లి శరత్ (20) అతడి స్నేహితులు వెంకటేశ్, నవీన్, ధీరజ్, ఆజెయ్ తార్నాసీపేట్ నుంచి వేగంగా వస్తూ నిలబడి ఉన్న ధూళీచంద్‌ను ఢీకొట్టారు. దీంతో తీవ్ర గాయాలై ధూళీచంద్ అక్కడికక్కడే మరణించగా వెంకటేశ్, ధీరజ్‌కు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స కోసం ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. స్నేహితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### చెరువులో పడి వ్యక్తి మృతి



చెరువు పడి మృతి చెందిన సత్యనారాయణ

మేడ్చల్‌రూరల్: చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌడవెళ్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రఘురాం తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గౌడవెళ్లి చెరువలో శనివారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు అయోధ్య చౌరస్తా వద్ద నివాసం ఉంటున్న నాగల్ల సత్యనారాయణ(26)గా గుర్తించారు. మృతుడు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోసులుసు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.